'పంచాయతీ' ఎన్నికలు పూర్తయ్యేవరకు కోడ్


- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు తుది విడత ఎన్నికలు పూర్తయ్యే వరకు నియమావళిని ఉల్లంఘించవద్దన్నారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీల్లోనూ కోడ్ అమలులో ఉంటుందని, ఎన్నికల నియమావళి నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

రేపు జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలను తిమ్మాపూర్ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సోమవారం ఉదయం కళాశాలలో రిపోర్ట్ చేయాలని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపతి దామోదర్, కోశాధికారి భీమనాతిని మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 13 నుంచి ఖమ్మంలో జరగనున్న రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం



- 202 మంది వార్డు సభ్యులు..
- రెండో విడతలో సర్పంచ్ బరిలో 438 మంది అభ్యర్థులు
- వార్డు సభ్యులకు 2,394 మంది పోటీ
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు...
- మూడో విడత నామినేషన్ల పరిశీలన పూర్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగే తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, గన్నేరువరం, శంకరపట్నం మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. దీంతో అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించి, సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఐదు మండల్లాలోని 113 గ్రామపంచాయతీల్లో రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 1,046 వార్డుల్లో 202 వార్డులకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి. తిమ్మాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని ఎనిమిది వార్డులు, మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

- తిమ్మాపూర్ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 97 మంది పోటీలో ఉన్నారు. 212 వార్డుల్లో 38 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 174 వార్డుల్లో 539 మంది పోటీ పడుతున్నారు.
- గన్నేరువరం మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గోపాల్‌పూర్, పీచుపల్లి సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. 56 మంది బరిలో ఉన్నారు. గోపాల్‌పూర్ సర్పంచ్‌గా ఆకుల కవిత (కాంగ్రెస్), పీచుపల్లిలో సామ రాజిరెడ్డి (బీజేపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 140 వార్డులకు 48 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 92 వార్డుల్లో 254 మంది పోటీలో ఉన్నారు.
- శంకరపట్నం మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 111 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 240 వార్డులకు 48 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 192 వార్డుల్లో 493 మంది బరిలో నిలిచారు.
- మానకొండూర్ మండలంలోని 29 గ్రామాల్లో సర్పంచ్ పదవులకు 99 మంది పోటీలో ఉన్నారు. 280 వార్డుల్లో 55 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 225 వార్డుల్లో 641 మంది పోటీపడుతున్నారు.
- చిగురుమామిడి మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 75 మంది పోటీలో ఉన్నారు. 174 వార్డుల్లో 13 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 161 వార్డుల్లో 467 మంది పోటీలో ఉన్నారు.
- మొదటి విడత ఎన్నికలు జరిగే ఐదు మండ

(మిగతా 8వ పేజీలో)



● ఊపందుకున్న ప్రచారాలు :

మొదటి, రెండు విడతల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో సర్పంచ్, వార్డు స్థానాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులంతా ప్రచారాలపై దృష్టి పెట్టారు. ఎన్నికలకు కొద్దిరోజుల సమయం మాత్రమే ఉండడంతో వారికి ఎన్నికల అధికారులు కేటాయించిన గుర్తులతో ఓటర్లను కలిసి మద్దతు కూడగడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి మద్దతు ఇచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటబెట్టుకొని ఓటర్లను కలుస్తున్నారు. అక్కడక్కడ రాత్రి వేళలో విందులతోపాటు మందు బాటిళ్లు, చికెన్, మటన్, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. మరికొన్నిచోట్ల తమను గెలిపిస్తే అవి చేస్తాం... ఇవి చేస్తామంటూ హామీలు ఇస్తూ.. వారికి కావలసినవి నజరానాగా ఇస్తున్నారు.



సతులు సర్పంచ్‌లకు.. పతులు వార్డు సభ్యులకు..



మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్కల సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఈ గ్రామంలో మహిళలు 2,326, పురుషులు 2,248, మొత్తం 4,574 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో 14 వార్డులున్నాయి. ఈసారి ఎన్నికల్లో నల్ల అనితారెడ్డి, నాగిశెట్టి రాజేశ్వరి, జనగామ పుష్పలత, మాడ లక్ష్మి సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసి బరిలో ఉన్నారు. వానే సర్పంచ్‌గా విజయం సాధిస్తే, వార్డు సభ్యులుగా గెలుపొంది ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యేందుకు వారి భర్తలు ప్రయత్నిస్తున్నారు. నల్ల అనితారెడ్డి భర్త నల్ల వంశీధర్‌రెడ్డి, మాడ లక్ష్మి భర్త మాడ తిరుపతిరెడ్డి ఆరో వార్డు నుంచి పోటీ పడుతున్నారు. జనగామ పుష్పలత భర్త జనగామ శంకర్ తొమ్మిదో వార్డు, నాగిశెట్టి రాజేశ్వరి భర్త నాగిశెట్టి రాజయ్య 12వ వార్డు నుంచి పోటీలో ఉన్నారు. ఈ గ్రామంలో భార్యలు సర్పంచ్‌గా భర్తలు వార్డు సభ్యులుగా బరిలో ఉండడం చర్చనీయాంశంగా మారింది.

● లింగాపూర్ సర్పంచ్ బరిలో తోటి కోడళ్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని లింగాపూర్ గ్రామం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. గ్రామంలో 10 వార్డులుండగా స్త్రీలు 964, పురుషులు 897 మొత్తం 1,861 మంది ఓటర్లు ఉన్నారు. గాలిపల్లి వసంత, తాండ్ర భవాని, తీట్ల మహేశ్వరి, మోటం సమ్మవ్వ, శీలం భాగ్యలక్ష్మి, శీలం స్వప్న సర్పంచ్ బరిలో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థుల్లో శీలం భాగ్యలక్ష్మి, శీలం స్వప్న తోటి కోడళ్లు. 14న జరిగే ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే.

● ఆడబిడ్డ పుడితే రూ. ఐదువేలు ఫిక్స్‌డ్ డిపాజిట్

గన్నేరువరం: సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి 'మాదాపూర్ మహాలక్ష్మి' పేరుతో ఓ హామీ ఇచ్చారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో పుట్టే ప్రతి ఆడబిడ్డ పేరుపై ఐదు వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ప్రకటించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధి పనులను చేపడతానని హామీ ఇస్తూ బాండ్ పేపర్ రాయించి ప్రచారం చేపట్టారు. తాను గెలిచాక ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే పదవి నుంచి తొలగించాలని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని బాండ్ పేపర్‌లో పేర్కొన్నారు.

ఈవీఎంల గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మికిరణ్



ఈవీఎంలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల గోదాం వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మికిరణ్ పోలీస్ గార్డులను ఆదేశించారు. ఆమె ఈవీఎం గోదాంను శనివారం తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె మహేశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ, సీపీఐఎం నాయకులు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, ఎంఐఎం నాయకుడు బర్కత్ అలీ, బీఎస్పీ నాయకుడు సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఆన్ డ్యూటీ (ఓడీ) సౌకర్యాన్ని కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ కలెక్టర్‌ను ఓ ప్రకటనలో కోరారు. పోస్టల్ బ్యాలెట్ పేపరుపై పెన్నుతో రైట్ మార్క్ చేసే పద్ధతికి బదులుగా స్వస్తిక్ మార్క్ ఉన్న ముద్రతో మాత్రమే ఓటింగ్ చేసేలా ఏర్పాటు చేయాలన్నారు. పెన్నుతో టిక్ చేయడం, రైట్ మార్క్ వేయడం వల్ల ఓటు ఎవరికి వేసింది తెలుస్తుందన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో బ్యాలెట్ బాక్సు ఓపెన్ చేసినప్పుడు పోస్టల్ బ్యాలెట్స్‌ను జనరల్ ఓట్లతో కలపాలన్నారు. దివ్యాంగులైన ఉద్యోగ ఉపాధ్యాయులు, ఫీడింగ్ మదర్స్, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పంచాయతీల్లో కీలకం.. ఉప సర్పంచ్ 7
● పలు గ్రామాల్లో ఆ పదవికి డిమాండ్

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం డీసీసీ కార్యాలయం, నగరంలోని కోర్ట్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునేలా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఎండీ తాజుద్దీన్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నగరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు లింగంపల్లి బాబు, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు

- హింసాత్మక ఘటనలను ఉపేక్షించొద్దు
- నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు
- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తులు లేదా పార్టీల ప్రతినిధులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల వేళ బందోబస్తుపై కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సీపీ సమీక్షా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ప్రలోభాలు, బెదిరింపులు, హింసా త్మక చర్యలకు పాల్పడే వారిపై తక్షణమే చర్యలు తీసుకో వాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలు, ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలీసు బలగాలను కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. సిబ్బంది కేటాయింపులపై పూర్తిస్థాయిలో సమీక్షించి, వారికి అవసరమైన శిక్షణ అం దించాలని ఆదేశించారు. ఫ్లాగ్‌మార్చ్ తప్పనిసరిగా నిర్వ హించాలన్నారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ప్రలోభా లకు, భయ భ్రాంతులకులోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించా లని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా ఉండేందుకు, కమిషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్ల బైండోవర్లను పూర్తి చేశామని సీపీ వెల్లడించారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్, మాధవి, విజయకుమార్, వెంకటస్వామి, యాదగిరి స్వామి, వేణుగోపాల్, వాసాల సతీష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, డిసెండరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని నగునూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సొసైటీ డైరెక్టర్ సాయిల్ల మహేందర్, సెంటర్ ఇన్‌చార్జి అజయ్ పాల్గొన్నారు.

మహాశక్తి ఆలయంలో మహా పడిపూజ



అభిషేకం చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో మహాపడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పతోపాటు గణపతి, కుమారస్వామి ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. అయ్యప్ప స్వామి దయతో దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, భారతదేశం అన్ని దేశాలలో అగ్రగామిగా నిలిచి ప్రగతి పథంలో పయనించాలని మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నార

ఘనంగా హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవం



గౌరవవందనం స్వీకరిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో హోంగార్డులు అమూల్యమైన సేవలందిస్తున్నారన్నారు. విధుల్లో అంకితభావం, ప్రతిభ కనబరిచిన హోం గార్డులను సీపీ ప్రత్యేకంగా అభినందిం చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్, ఇతర క్రీడా పోటీల్లో విజయం సాధించిన హోంగార్డులకు ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు విజయకుమార్, వెంకటస్వామి, యాదగిరిస్వామి, హోంగార్డు ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో గుంటపల్లిచెరువు తండా వాసి మృతి



రవి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాకు చెందిన గుగులోతు రవి(43) సౌదీలో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామంలో రవి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయంతో పాటు దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఐదేళ్లక్రితం రూ.2లక్షలు అప్పు చేసి ఖతార్ వెళ్లాడు. అక్కడ సరైన పనిదొరకక వెళ్లిన ఆరునెలలకే ఇంటికి చేరుకున్నాడు. రెండేళ్ల క్రితం మరో రూ.5లక్షలు బాకీ చేసి కూతురు వివాహం జరిపించాడు. అప్పు తీర్చేందుకు యేడాది క్రితం రూ.3లక్షలు అప్పుచేసి సందర్శక వీసాపై సౌదీ దేశానికి వెళ్లాడు. అక్కడిగదిలో అస్వస్థతకు గురైన ఆయనను తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి గుండెపోటుతో చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. శనివారం మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కూతుళ్ల స్రవంతి, చిట్టి, సోనా, కొడుకు దివాకర్ ఉన్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కాశెట్టి వాడకు చెందిన చెరుకు రాకేష్(33) అనేవ్యక్తి మానసిక వేదనకు గురై ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్ఐ జి.మహేష్ కథనం ప్రకారం.. చెరుకు రాకేష్‌కు ఐదుసంవత్సరాల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రాకేష్ నాలుగు నెలల క్రితం కువైట్ దేశం వెళ్లి అక్కడ పని దొరక్క వారం రోజులకే ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచి ఆర్థికంగా నష్టపోయానని తరచూ బాధపడు తుండేవాడు. శనివారం మధ్యాహ్నం తన బంధువైన కాశెట్టి నాగరాజు షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరాడు. అనంతరం ఆ షాపులో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినపల్లి మండల పరిధిలోని రూసో కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జునైద్ మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే అవగాహన తప్పనిసరి అని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని అనుమానాస్పద లింకులు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా సైట్‌లను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో వాళ్ళకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, సంపత్, రాజ్ కుమార్, మౌనిక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తొలగించని సిల్ట్..

● బురద నీటితో నిండిన మురికి కాలువ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామంలో బురద నీటితో మురికి కాలువలు అపరిశుభ్రంగా మారాయి. ఈ కారణంగా దోమలు వృద్ధిచెందాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయినా పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మురికి కాలువల్లో సిల్ట్ తొలగించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు. అనారోగ్యాల బారిన పడక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెత్తతో అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీ

● అమల్లోకి ఎన్నికల కోడ్

● నిఘా కోసం ప్రత్యేక బృందాలు



ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

● పాటించవలసినవి..

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులు అధికారిక పర్యటనలో ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. వాహనాలను అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానిక ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

● ప్రచారంలో జాగ్రత్తలు వహించాలి

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. నిరాధార ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

బస్ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఈనెల 5వ తేదీన వేములవాడ మూలవాగు వంతెనపై ఆపి డ్రైవర్, కండక్టర్‌ను బెదిరించిన మూర్తి రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ కండక్టర్ బాలసాని స్వప్న, డ్రైవర్ మొగిలి వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపి బెదిరించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో కొలగాని రవి అనే మేకల కాపరికి చెందిన మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. శనివారం గ్రామరెవెన్యూ పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన కంచెవద్ద మేక మేత మేస్తుండగా విద్యుదాతానికి గురై మృతిచెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రవి ప్రభుత్వాన్ని కోరాడు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని మోటారు వైండింగ్ దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మోతె సంతోష్‌ను అరెస్ట్ చేశామని ఎస్ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. నిందితుడివద్ద నుంచి రూ.35వేల విలువైన బోరుమోటారు సామగ్రి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. వీర్నపల్లిలోని పర్లపల్లి బాబు దుకాణంలో నుంచి సంతోష్ వ్యవసాయ బోరు మోటారుతోపాటు సామగ్రిని ఎత్తుకెళ్లాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



చందుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ కోసం ఆత్మాహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చందుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కొరకు న్యాయం కావాలని కోరుతూ ఒక యువకుడు ప్రాణం తీసుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ త్రిని శ్రీనివాస్,బీజీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అమర బండ ప్రసాద్, నాయకులు వనపర్తి సతీష్, హమయ్య చారి, చిలక శ్రీనివాస్, మేడిశెట్టి జగన్, బత్తుల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో బాలబాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. శనివారం జిల్లా నుంచి పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల బాలబాలికలు బబ్బిలి అక్షయ్, మాలేపు రిషికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా వారిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల కొరడా



పోలీసులకు పట్టుబడిన వాహనాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్స్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో సరైన నంబర్ ప్లేట్లు లేని 73 వాహనాలను గుర్తించారు. వాటి యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. జరిమానాలు విధించిన అనంతరం, ఆయా వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లను బిగింపజేసి పంపినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పౌరులు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

అభ్యర్థులందరికీ.. ఒకే గొంతు

● ప్రచారంలో సలీం గళం



వాయిస్ రికార్డింగ్ చేస్తున్న సలీం

సిరిసిల్ల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఆయన మైక్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్య ర్థులను గెలిపించాలని అంటారు.. స్వతంత్రులకు ఓటెయ్యండి అంటూ ప్రచారం చేస్తాడు... గొంతు ఒక్కటే అభ్యర్థులు, పార్టీలు వేరు.. ఈ గొంతుప్రస్తుతం తెలంగాణ పంచా యతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ఏప్రాంతంలోనైనా శాసన సభ, పార్లమెంట్ ఏ ఎన్నికల్లో అయినా మారుమోగుతూనే ఉంటుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీలకు ఓటేద్దాం రండి అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సలీం గొంతుతో ప్రచారం సాగుతుంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లోనూ వివిధ అభ్యర్థులకు ప్రచారం మొదలు పెటారు. అతను దాదాపు నాలుగు దశాబ్దాలుగా అందరు అభ్యర్థుల ప్రచారానికి ఆయన గొంతు అరువు ఇస్తూనేఉన్నాడు. సార్వత్రిక ఎన్నికలైనా.. స్థానిక ఎన్నికలైనా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన ప్రచారకళాకారుడు ఎండీ సలీం గొంతు వినిపించాల్సిందే. సిరిసిల్లలోని లక్ష్మీ థియేటర్ రిక్షాలో కూర్చొని సినిమాల ప్రచారం కోసం 1974లో వినిపించిన సలీం గొంతు అందరినీ ఆకట్టుకుంది. సినిమా ప్రచారం, బీడీలు, లాటరీ టిక్కెట్లకు ఆయన ప్రచారం చేసేవారు. ఇలా సలీం గొంతు వివిధ కంపెనీల వారిని ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్ల అమ్మకాల ప్రచారంతో సలీం కంఠం రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. ఆడియో క్యాసెట్లు రావడంతో సలీం ప్రచారం మరింత ఊపందుకుంది. రాజమండ్రి పాలకోవా నుంచి హైదరాబాద్‌లో మార్కెట్లకి విడుదలయ్యే వస్తువుల ప్రచారానికి సలీం గొంతునే ఉపయో గించేవారు. వాణిజ్య ప్రచారాల నుంచి సలీం గొంతు రాజకీయ పార్టీలకు చేరింది. అన్ని పార్టీల వారు తమ ఎన్నికల ప్రచారానికి, ఆందోళన కార్యక్రమాల ప్రచారానికి సలీం గొంతుతోనే ప్రచారం చేసుకుంటున్నారు. మాతృభాష ఉర్దూ అయినా సలీం తెలుగులో అనర్గళంగా మాట్లాడుతారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు చెన్నై, ముంబాయి, భీవండిలోనూ సలీం గొంతును ప్రచారానికి ఉపయోగించుకున్నారు. వృత్తి పరంగా రికార్డింగ్ సెంటర్, మైక్, టెంట్స్ సరఫరా చేసే సలీం, గాయకుడు ఘంటసాల గానం చేసిన పాటలను ఒక దగ్గర నిక్షిప్తం చేయాలన్న తపనతో ఘంటసాల కల్చరల్ ఆకాడమీ ఏర్పాటు చేశారు. 40ఏళ్లుగా ప్రచార రంగంలో తనకంటూ ఓ స్థానం కల్పించుకున్న సలీం ఆకాశవాణిలో ప్రత్యక్ష వాఖ్యానం, ఘంటసాల ఆలపించిన పాటలకు వ్యాఖ్యానం అందించారు. సలీం మైసూర్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు కళాజ్యోతి, కళాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలను సైతం అందుకున్నారు. ప్రస్తుత పంచా యతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఆయన గొంతును ప్రచారాలకు ఉపయోగించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ముస్తాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలక్ష్మణపల్లె వై జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు వెంకటయ్య, భార్య లక్ష్మీతోకలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వారు వాహనంపై నుంచి కిందపడి పోయారు. వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భార్యలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేట పెద్దమ్మ ఆలయం మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన దేవిరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పడంతో ప్రమాదంజరిగింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడ్డ దేవిరెడ్డిని గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా అబ్బాయికుంట లేబర్ కాలనీకి చెందిన కొండబత్తుల అనిల్‌కుమార్ అతడి కుమారుడు కొండబత్తుల ప్రదీప్‌తో కలిసి శనివారం ఉదయం వేములవాడ, కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తాడికల్ పెద్దమ్మతల్లి గుడి వద్ద లారీని ఓవర్టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా, అతడి కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేకచోట్ల అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనాలు, ఇళ్లను నిర్మిస్తున్నారని అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి తమస్థలంలో వేరొకరు ఇళ్ల నిర్మిస్తున్నారని, తమపక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో, మరికొందరు నేరుగా కమిషనర్‌ను, టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. రోజుల కొద్దీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు విసిగివేసారి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరికి నోటీసులు జారీచేయడం, మరికొందరి ఫిర్యాదులను పరిశీలించి తాత్కాలికంగా పనులు నిలిపివేయడం, కొందరి భవన నిర్మాణసామగ్రిని తీసుకొచ్చి ఆ తర్వాత వదిలిపెట్టడం మినహా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సమస్యను బట్టి ముడుపులు తీసుకొని నోటీసులిచ్చామని, చర్యలు తీసుకుంటామని సర్దిచెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జ్యోతినగర్‌కు చెందిన పీటర్ అనేవ్యక్తి తన నివాసాన్ని (2-10-1175) ఆనుకొని ఉన్న ఒకరు అనుమతులు, సెట్ బ్యాక్, పార్కింగ్ బహుళ అంతస్తు షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తనఇంటికి వెంటిలేషన్ లేకుండా పోతోందని ఆవేదన చెందాడు. 2025 జూన్ 23న మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాడు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీకి పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ఎండార్స్ చేస్తూ ఆయనను కలువాలని సూచించారు.

కమిషనర్ వెంటనే స్పందించడంతో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, అయితే దాదాపు ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ, అధికారులచుట్టూ తిరుగు తున్నాచర్య తీసుకోలేదని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయాడు. ఎన్నోసార్లు అధికారులను కలిసినా వారు న్యాయం చేయక పోగా ఫిర్యాదు చేసిన వ్యక్తికి సపోర్టు చేస్తుండడంతో భవన నిర్మాణం జరుగుతోందని, దీనితో తనతోపాటు ఇరుగుపొరుగు ఇళ్లకు వెంటిలేషన్ లేకుండా పోతుందని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని తెలిపాడు. ఇలా ఎంతోమందికి జరుగుతున్న అన్యాయాలపై కమిషనర్ స్పందించి న్యాయం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● ఆందోళనలో ప్రయాణికులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం దూలూరులో బొమ్మెనకు వెళ్ళే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లకిందట ఇక్కడ ఇళ్లులేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పెరగడం వల్ల జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇక్కట్లు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని లేదా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దూలూరులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాలేజీ గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్



జిమ్ చేస్తున్న వాకర్స్

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జిమ్‌లో వాకర్స్ వినియోగించుకునేలా అందుబాటులోకి తెచ్చారు. దీంతోవాకర్స్ ఉత్సాహంగా జిమ్ చేశారు. వాకింగ్, జాగింగ్ కోసం గ్రౌండ్‌వచ్చే వారికోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీసర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే ఈ జిమ్‌నుమంత్రి శ్రీధర్‌బాబుతో ప్రారంభోత్సవం చేయి స్తామన్నారు. ఓపెన్ జిమ్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ కోరారు.

భద్రాచలం, పాపికొండలకు ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్‌లో భాగంగా భద్రాచలం, పాపికొండలు వెళ్లేందుకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం పాపికొండలు బోటింగ్ అనంతరం అదే రోజు రాత్రి భద్రాచలం, పర్ణశాల దర్శనం అనంతరం అదే రాత్రి వరకు కరీంనగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.1800, రూ.1300 చొప్పున చార్జి ఉంటుందని, వివరాలకు 9398658062, 8978383084, 9182610182 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జిల పూజలు




ఆలయంలో నందీశ్వరుడి వద్ద న్యాయమూర్తులు

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో శనివారం హైకోర్టు జడ్జిలతోపాటు జిల్లాలోని పలు కోర్టుల జడ్జిలు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ముఖ్యఅర్చకుడు వారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. అనంతరం మల్లికార్జునస్వామి, రామాలయంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు భద్రయ్య, పంచాక్షరి, సిబ్బంది వారిని సన్మానించి ఆలయ జ్ఞాపికలను అందజేశారు. హైకోర్టు జస్టిస్‌లు పుల్ల కార్తీక్, అలిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, జిల్లా జడ్జిలు సునీత, గణేష్, వెంకటేష్, సచిన్‌రెడ్డి, సరిత, మంజుల, భవాని, సుధ, సంధ్యారాణి అలాగే డీసీపీ రామిరెడ్డి, ఏసీపి గజ్జికృష్ణ, ఎస్‌ఐ దీకొండ రమేష్, వకీళ్ల ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవనానికి స్థల పరిశీలన..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో జిల్లా కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం హై కోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ సందర్శించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 1072లో కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, స్థలం వివరాలు, భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రదాన న్యాయమూర్తి సునిత కుంచాల, పెద్దపల్లి డీసీపీ రామిరెడ్డి ,పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య , ఏసీపీ గజ్జి కృష్ణ తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



పంచాయతీల్లో కీలకం.. ఉప సర్పంచ్

పలు గ్రామాల్లో ఆ పదవికి డిమాండ్

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు నిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉప సర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందుకోసం ఉప సర్పంచ్ స్థానాలపై ప్రధానంగా గురిపెడుతు న్నాయి. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌ను కూడా కైవసం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతి కూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఉప సర్పం చ్‌కు చెక్ పవర్ ఉండడం ఈ పదవికి డిమాండ్‌ను పెంచింది. ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యు లే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి మద్దతు ఉన్న వారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

● వార్డు సభ్యులే కీలకం..

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహాలు మార్చుకుంటున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉప సర్పంచ్ పదవిని దక్కించుకుందామని పథకాలు రచించుకుంటున్నారు. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయించినట్లు సమాచారం. 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉప స్పంచ్‌గా గెలుపొంది అధిపత్యం చేలాం ఋంచవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలి గిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగారు. పాలకవర్గ సమావేశాలకు సర్పం చ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉప సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు.

● ఎన్నిక ఇలా...

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు సాయంత్రంలోగా వెలువడుతాయి. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరికి సమాన ఓట్లు వస్తే టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

● చెక్ పవర్‌తోపాటు అధికారాలు ఉండడం కారణం

● ఉప సర్పంచ్ అధికారాలు

సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు పర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజా పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వేముల లక్ష్మీప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న వేముల లక్ష్మీప్రసాద్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు తొలి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (ఏడీఓపీ)గా వేముల లక్ష్మీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం లక్ష్మీప్రసాద్ రాజన్నసిరిసిల్ల జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వేముల లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నేరస్థులకు శిక్షలు విధింపజేయడంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయం అత్యంత ముఖ్యమన్నారు. కేసుల దర్యాప్తు దశ నుంచి కోర్టు వాదనలు పూర్తయ్యే వరకు కలిసి పనిచేస్తే నేరస్తులకు కచ్చితమైన శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. లక్ష్మీ ప్రసాద్ నియమాకంపై కరీంనగర్ డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మంచికట్ల రాజేశం, మల్యాల ప్రతాప్ అభినందనలు తెలిపారు.

తెలంగాణను అగ్రగామిగా నిలుపుతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ 2040 విజన్‌తో దేశంలోనే తెలంగాణను అగ్రగామి నిలుపుతామని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి గ్లోబల్‌సమ్మిట్ ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్‌గ్లోబల్ సమ్మిట్‌కి బండిసంజయ్‌ని ఆహ్వానించినట్లు చెప్పారు. పెట్టుబడులు, ఇండస్ట్రియల్ గ్రోత్‌ను తెలంగాణ సమ్మిట్‌ద్వారా సాధిస్తామన్నారు. పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనకబడిందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎక్కువ నిధులు ఇస్తోందని, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని అన్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానపత్రికను అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

● సాయి ఈశ్వర్ మృతి బాధాకరం..

బీసీరిజర్వేషన్లపై సాయిఈశ్వర్ మృతి బాధాకరమని మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని కోరారు. సాయి ఈశ్వర్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. ఎవరు ప్రేరేపించినా మీరు బలిపశువులు కావద్దని సూచించారు.

● కులగణనకు కట్టుబడి ఉన్నాం

కులగణనకు కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. 50శాతం రిజర్వేషన్ దాటరాదన్న కేసును సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామన్నారు. బలహీనవర్గాల సోషల్‌జస్టిస్ విషయంలో కాంగ్రెస్ చాంపియన్‌గా ఉందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రావ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడమంటే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంమీద అందరంకలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. చలోఢిల్లీ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం దద్దరిల్లేలా 50శాతంకోటఎత్తివేసేలా ఉద్యమించాలన్నారు. అంకుముందు చైతన్యపురిలోని మహాశక్తి ఆలయంలో పూజలుచేశారు. ఆయనవెంట ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ఆచార్య ఉమేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నతశిఖరాలకు ఎదగాలని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం యూనివర్సిటీ మైదానంలో యూనివర్సిటీస్థాయి అంతర్ కళాశాలలో పురుషుల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలనానరు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 10 నుంచి 14వరకు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికచేశారు. ఓఎస్‌డీ హరికాంత్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, పీఆర్వో పీడీ విజయ్ కుమార్, వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వర్‌రావు, శ్రీనాథ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దంపేట ఎన్నిక నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండ లం పెద్దంపేట గ్రామ పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. మొదటివిడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న పెద్దంపేట పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. పెద్దంపేట పంచాయతీకి సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున 11న ఎన్నికను నిర్వహించవద్దని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 15న ఎన్నికపై తుదితీర్పు వెలువడనుండడంతో అప్పటివరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కోర్టు తీర్పును అనుసరించి అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహహోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయం ముందు భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయఅధికారులు పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం వాహనాలతో నిండిపోయింది.

రక్త సంబంధీకుల నుంచి చట్టపరమైన దత్తత



పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్త సంబంధీకుల నుంచి పిల్లలను దత్తత తీసుకోదలిస్తే చట్టబద్ధంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్త సంబంధీకుల నుంచి 12నెలల బాబును చట్టపరమైన దత్తత తీసుకున్నారు. వీరికి కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారికార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) పర్వీన్, ఎల్‌పీవో రాజు, యం రాజ్ కుమార్, రమేష్, మిషన్ వాత్సల్య పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



చేవెళ్లలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి వెంకటేష్

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో చేవెళ్లలో నిర్వహించిన ఇగ్నైట్-2025 సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి సత్తా చాటాడు. రాష్ట్రవ్యాప్తంగా 194మోడల్ స్కూళ్లు పాల్గొన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెంకటేష్ అనే విద్యార్థి గైడ్ టీచర్ సందీప్‌రాజ్ సహాయంతో తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ మిషన్‌కు కన్సోలేషన్ బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన వెంకటేష్‌ను, గైడ్‌టీచర్ సందీప్‌రాజ్‌ను ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పీఎంశ్రీ స్కూల్స్‌స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, జిల్లావిద్యాశాఖ అధికారి కె.రాములు పాల్గొన్నారు. జిల్లాలోని 16పీఎంశ్రీ స్కూ ల్స్‌కి నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుట్బాల్ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి లోని పలు పోటీల్లో ప్రతిభ కనపరచి జిల్లాపేరును నిలబెడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చిప్ప సత్య నారాయణ, కొక్కుల రాజేష్, కోరుట్ల మహేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్, పెటాఅధ్యక్షుడు విశ్వప్రసాద్,పిడుగు భాస్కర్, కృష్ణప్రసాద్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో 6వ వార్డుకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మీద నిర్మించిన రోడ్డు ఒకవైపు కూలి పెద్ద గొయ్యి ఏర్పడిరది. దీంతో ఈ వార్డుకు వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ దారి గుండా వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు ఈ డ్రైనేజీలో పడి వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



డ్రైనేజీపై ఏర్పడిన గొయ్యి

సర్పంచ్ అభ్యర్థిపై ఫిర్యాదు

ఎలిగేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి ఏలేటి వెంకట్ రెడ్డిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ భాస్కర్ రావుకు శనివారం ఫిర్యాదు చేసినట్లు మరో సర్పంచ్ అభ్యర్థి బాసంపల్లి రాజేష్ తెలిపారు. ఏలేటి వెంకట్ రెడ్డి ఇప్పటికే సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు, నాయకులు న్యాతరి పోచయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, సుజికి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇప్పపల్లి రైతులతో ఆర్డీవో సమావేశం



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లి రైతులతో శనివారం కోరుట్ల ఆర్‌డీఓ జివాకర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహిచారు. సూరమ్మ చెరువు ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా రైతులు భూములు కోల్పోతున్న నేపథ్యంలో నష్ట పరిహారం చెల్లింపుకుగాను అవార్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ప్రభుత్వ భూవిలువ ప్రకారం ఎకరాకు రు.8.60లక్షలు చెల్లించడానికి నష్టపరిహారం విడుదల చేసిందని రైతులకు సూచించారు. కాగా బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రు. 50 లక్షలు ధర ఉందని ఆ ధర చెల్లించాలని ఆర్‌డీఓకు రైతులు వినతి పత్రం అందజేశారు. అయితే నిర్ణీత డబ్బులు కోర్టులో డిపాజిట్ చేసి పనులు ప్రభుత్వం ప్రారంభిస్తుందని రైతులతో ఆర్‌డీఓ చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, రైతులు ఉన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లో శనివారం అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణరావు, సునీల్‌రావు, వాసాల రమేష్, గుగ్గిళ్ల రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ బస్టాండ్‌లో రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, అంజనేయులు, మల్లేశం, రాజయ్య, శ్రీనివాసరావు, సాంబయ్య, కుమార్, దేవయ్య, వీరస్వామి, బోయెజ్ పాల్గొన్నారు.

● ఆర్టీసీ అధికారులు నివాళులు అర్పించారు. కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి రవీందర్, రమణ, రాజనర్సు, దొంత రాజయ్య పాల్గొన్నారు.

● రేకుర్తిలో అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. నరహరి లక్ష్మారెడ్డి, గంట్ల నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నాంపల్లి శంకర్, ప్రతాప్‌రెడ్డి, గోదారి నరేష్, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ ఎస్సీసెల్ పార్లమెంట్ అధ్యక్షుడు బోలుమల్ల సందానందం, రాష్ట్ర అధికారప్రతినిధి దామెర సత్యం, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి బాలగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మొగిలి, చిరంజీవి, స్వామి, సతీష్, నరేందర్, రవీందర్, సదయ్య, సారంగపాణి పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ చైర్మన్ మారెపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, మేధావులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ నివాళులర్పించారు. జాగృతి నాయకులు చంటి శ్రీనివాస్, జంగ అపర్ణసాగర్, కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మన్, శ్రీరాముల రమేశ్, హుస్నాబాద్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: నగరంలోని కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు పూసాల విష్ణు, గోసుకుల విగ్నేష్, చిప్ప యోగేష్, వంశీ, నందు పాల్గొన్నారు.

ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నెమల్ల సురేష్, పాతకుల భూమయ్య, సముద్రాల అజయ్, రొండి అరుణ్, గజ్జెల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. నాయకులు తిరుపతయ్య, పింగిలి రమేష్, రామంచ భరత్, ఆవాల హరిబాబు, అఖిల్‌గౌడ్, పుల్ల వెంకన్న, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ఫ్యాకల్టీ డాక్టర్ పురం ప్రదీప్ కుమార్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానకొండూర్: అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. మానకొండూర్‌లో శనివారం నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడారు. అంబేద్కర్ అందించిన ఫలాలను ప్రతీ ఒక్కరు పొందాలన్నారు. మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్, ప్రేమ్‌కుమార్, రొడ్డ అంజయ్య, ఇస్కుల్ల ఆంజనేయులు, తాజొద్దీన్, నెల్లి శంకర్ ఉన్నారు.

గంగాధర: గంగాధర మండలంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు గంగాధర ప్రవీణ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. సంఘం నాయకులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారునంది జలపతి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అలుగునూర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

(5వ పేజీ తరువాయి)

లాల్లోని 92 గ్రామపంచాయతీలు మూడు సర్పంచు పదవులు ఏకగ్రీవమయ్యాయి. 89 సర్పంచు పదవులకు 438 మంది బరిలో ఉన్నారు. 866 వార్డుల్లో 270 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన వార్డుల్లో 1,581 మంది పోటీలో ఉన్నారు. మూడో విడతలో జరిగే గ్రామపంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన పూర్తయింది.

● రెండు విడతల్లో ఐదు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

మొదటి విడతలో చొప్పదండి మండలం పెద్దకురుమపల్లి గ్రామ సర్పంచ్‌గా మావురం సుగుణ (ఇండిపెండెంట్), దేశాయిపేట సర్పంచ్‌గా వడ్లకొండ తిరుమల (ఇండిపెండెంట్), రామడుగు మండలం శ్రీరాములపల్లి సర్పంచ్‌గా ఒంటెల సుగుణమ్మ (బీఆర్ఎస్)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో విడతలో జరిగే గ్రామపంచాయతీల్లోని గన్నేరువరం మం డలంలోని గోపాల్‌పూర్ సర్పందచ్‌గా ఆకుల కవిత (కాంగ్రెస్), పీచుపల్లి సర్పంచ్‌గా సామ రాజిరెడ్డి (బీజేపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు విడతల్లో ఈనెల 11, 14న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఐదు సర్పంచు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన వెలిచాల రాజేందర్‌రావు


మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, డిఎంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శనివారం కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు నగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యంకు రాజేందర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

రెండు రోజులు భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

వీణవంక,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు జీఎల్‌బీఆర్ వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీకి మరమ్మతు దృశ్యా ఆది, సోమవారాల్లో నీటి సరఫరాకు అంతారాయం కలుగు తుందని ఈఈజే రామ్ కుమార్ తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీ ప్రజలు స్థానిక వనరుల నుంచి నీటిని వినియోగించు కోవాలని కోరారు. మరమ్మతు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు లెజెండ్ విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు నగరంలోని భగత్‌నగర్ లెజెండ్ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రేష్ఠ నందిని ఎంపికైంది. ఈ నెల 8 నుంచి మూడు రోజులపాటు ఆదిలాబాద్‌లో జరగనున్న 36వ సౌత్ జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ రాజయ్య, ప్రిన్సిపాల్ అభినందించారు.

భగవద్గీత పోటీల్లో వింధ్యావాలీ విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా ప్రజ్ఞ వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత, వ్యాసరచన, చిత్ర లేఖన పోటీల్లో జిల్లా కేంద్రంలోని వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. భగవద్గీత శ్లోకం భావం పోటీల్లో విద్యార్థులు మన్విత్, యశశ్వి, సహస్ర, సంహిత, వ్యాసరచన పోటీల్లో సహన, సిరివెన్నల, చిత్రలేఖన పోటీల్లో చైత్రిక, ఆద్య బహుమతులు అందుకున్నారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు.

ఏకగ్రీవ సర్పంచులకు ఎమ్మెల్యే అభినందనలు

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెండో విడుత నామినేషన్ల ఉప సంహరణ శనివారంతో ముగిసిందని, చాలా గ్రామాల్లో సర్పంచులు ఏకగ్రీవ మయ్యారని పేర్కొన్నారు. ఇల్లంతకుంటలో ఎనిమిది గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారు. కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి (ముస్కానిపేట), బొల్లం మంజుల-రమేష్ (తిప్పాపూర్), బద్దం శేఖర్‌రెడ్డి (గాలిపల్లి), పండుగ అనిత-తిరుపతి (జంగంరెడ్డిపల్లి), జక్కుల మల్లవ్వ (కిష్టారావుపల్లి), జుట్టు శేఖర్ (పత్తికుంటపల్లి), కంకటి కళ్యాణ్ (చిక్కుడువానిపల్లె), పోతరాజు చంటి (కేశన్నపల్లి) ఉన్నట్లు తెలిపారు. గన్నేరువరం మండలం పీచుపల్లి నుంచి రాజిరెడ్డి, బెజ్జంకి మండలం నర్సింహులపల్లి జెట్టి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాధర, కురిక్యాలలో పోలింగ్ స్టేషన్లను స్టేట్ ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీవో ప్రత్యూష, గౌరి రమేష్, కార్యదర్శులు జ్యోతి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి ఆసిఫ్‌నగర్ మాజీ సర్పంచ్ సస్పెండ్

భగత్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ (బావుపేట) మాజీ సర్పంచ్ కడారి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు కొత్తపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. కడారి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు, తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డిని కోరినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

హుజూరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట్ల ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వివిధ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను శనివారం సర్దుబాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో పనిచేస్తున్న ఉమాదేవిని హుజూరాబాద్‌లోని పీఎస్‌కు, శాంతిలతను సిర్సపల్లి ఎస్సీ కాలనీ, పెద్దపాపయ్యపల్లిలో పనిచేస్తున్న శ్రీదేవిని కాట్రపల్లి, చెల్పూర్‌లో పనిచేస్తున్న విజయలక్ష్మిని సైదాపూర్ మండలం అమ్మనగుర్తి, రంగాపూర్‌లో పనిచేస్తున్న గోపాల్‌రెడ్డిని రాంపూర్, హుజూరాబాద్ హైస్కూల్లో పనిచేస్తున్న చంటిని సైదాపూర్ మండలం వెన్కేపల్లి, హుజూరాబాద్ మండలంలో పనిచేస్తున్న పవన్‌కుమార్, తిరుపతి, సురేందర్‌లను జిల్లా ఇన్‌స్పెక్షన్ టీమ్‌కు సర్దుబాటు చేశారు.

టెట్రా హెడ్రన్ మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

హుజూరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనలో భాగంగా హుజూరాబాద్‌లోని టెట్రా హెడ్రన్ మోడల్ స్కూల్ విద్యార్థులు పట్టణ శివారులోని నాగార్జున డెయిరీని శనివారం సందర్శించారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ పాతూరి రజనీకాంత్‌రెడ్డి, మాటూరి శ్రీనివాస్, క్యాసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో సాయిఈశ్వర్ చారికి నివాళి

గణేశ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆత్మహుతి చేసుకున్న సాయి ఈశ్వర్ చారికి బీసీ సంఘాల నాయకులు నివాళి అర్పించారు. నాయకులు దొగ్గలి శ్రీధర్, నర్సింగోజు శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ స్తూపం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే విధంగా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని, సంఘాలకు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఈశ్వర్ చారి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. నాయకులు కేశి పెద్ది శ్రీధర్ రాజు, నాగుల కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్ జన్మదిన వేడుకలను కరీంనగర్ గీత భవన్ చౌరస్తా ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీకి క్రేన్ సహాయంతో గజమాలను అలంకరించారు. కేక్ కట్ చేశారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం నల్లగుంటపల్లి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి వడ్లూరి అంజయ్య, వార్డు స్థానాల అభ్యర్థులు శనివారం కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరారు.

కరీంనగర్ కల్చరల్ : నగరంలోని వైశ్యభవన్‌లో ఆదివారం నుంచి 14వ తేదీ వరకు సుధామ వాకింగ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో పణతుల మేఘరాజ్‌శర్మ శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భగత్‌నగర్ : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా న్యాలపట్ల రాజు ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి గాను రాజును జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నట్లు తెలిపారు.

చొప్పదండి: లయన్స్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చొప్పదండి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 10 వేల రూపాయల విలువగల స్టీల్ ప్లేట్లను తహసిల్దార్ నవీన్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారు బొమ్మకల్‌లో లయన్ ఇంటర్నేషనల్ జిజల్లా 320జీ ఆధ్వర్యంలో లయన్స్ చింతల కిషన్ కూతురు బొక్కల మనిషా-సాయికిరణ్ పటేల్ పెళ్లి రోజు సందర్భంగా ఇటుక బట్టీల వలస కూలీలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో అల్పాహారం, ప్రభుత్వ వయోవృద్ధులు, దివ్యాంగుల వసతి గృహంలో పండ్లు పంపిణీ చేశారు.

భారతీయ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక యోగా


అభినందిస్తున్న బండి సంజయ్ కుమార్, పొన్నం ప్రభాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడకారులను శనివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జాతీయస్థాయి యోగా పోటీల్లో క్రీడాకారులు పతకాలు సాధించాలని సూచించారు. ప్రపంచానికి భగవద్గీతను అందించిన భారత దేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేస్తూ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యోగా సాధనతో సార్వత్రిక శక్తి, ఆధ్యాత్మిక ధ్యానం లభిస్తాయన్నారు. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చాయన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు రాంచీలో ఈ నెల 27 నుంచి 30 వరకు జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్, జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కార్యదర్శి గుంటి రామకృష్ణ, కోశాధికారి స్వరూపచారి, రమణారెడ్డి, యోగా కోచ్‌లు పాల్గొన్నారు.

14న అల్ఫోర్స్‌లో మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈనెల 14న తెలంగాణలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో మూడు నుంచి 10వ తరగతి సీబీఎస్ఈ, స్టేట్, ఐపీఎస్ఈ విద్యార్థులకు అమాట్ పేరుతో మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో అమాట్-2025 పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ కృషి ఎంతో మందికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ నెల 14న ఉదయం 10 గంటల నుంచి 11 వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. 22న రామానుజన్ జయంత్యుత్సవాల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్మమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని మహాత్మానగర్, రామకృష్ణ కాలనీలో ఎమ్మెల్యే సర్పంచ్ అభ్యర్థులతో కలిసి పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలిపించాలన్నారు. మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

30 ఏళ్ల పైవారికి బీపీ, షుగర్ పరీక్షలు చేయాలి


మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల పైవారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం నగరంలోని సప్తగిరి కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులు ప్రైవేటు మందులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలి పారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో మహిళలకు రీస్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేయాలని, రిఫరల్ కేసులను ఫాలో అప్ చేస్తూ అవగాహన కల్పించాలని సూచిం చారు. పిల్లలకు సంబంధించిన టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌ను, ఐఈసీ బోర్డును, దానిపై బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఎన్‌సీడీ పీవో డాక్టర్ ఉమాశ్రీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాఫిర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తొలి విడత పోలింగ్ జరగనున్న ప్రాంతాలపై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు సీపీతో పాటు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శనివారం కొత్తపల్లి మండం లోని ఆసిఫ్ నగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వ హించారు. స్థానిక ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రలోభాలకు లోనవకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు సాంబమూర్తి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేష్ల ఉపసంహరణ శనివారం పూర్తయ్యింది. తిమ్మాపూర్ మండలంలో నామినేషన్ల ఉప సంహరణ అనంతరం 23 గ్రామ పంచాయతీలకు 97 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. 212 వార్డులు ఉండగా అందులో 38 వార్డులు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 174 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 539 మంది వార్డు సభ్యులు పోటీలో ఉన్నట్లు తెలిపోయింది. వచ్చిన నామినేషన్లలో 17 మంది సర్పంచ్, 50 మంది వార్డు సభ్యుల కోసం వేసినవారు ఉప సంహరించుకున్నారు.

నర్సింగపూర్‌లో పలు వార్డులు ఏకగ్రీవం

తిమ్మాపూర్ మండలంలో 212 వార్డుల్లో 38 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. అందులో ముఖ్యంగా నర్సింగపూర్ పంచాయతీ పరిధిలో 8 వార్డులకు అన్ని ఏకగ్రీవం కావడం విశేషం. మిగిలిన వాటిలో బాలయ్యపల్లి 1, గొల్లపల్లి 4, జుగుండ్ల 3, కొత్తపల్లి 2, లక్ష్మీదేవిపల్లి 1, మహాత్మానగర్ 1, మల్లాపూర్ 3, నల్లగొండ 2, నేదునూర్ 1, పర్లపల్లి 3, పోలంపల్లి 3, పోరండ్ల 1, రామకృష్ణ కాలనీ 1, రాంహనుమాన్ నగర్ 3, వచ్చునూర్ 1 ఉన్నాయి.

మానకొండూర్: మానకొండూర్ మండలంలో 29 గ్రామపంచాయతీలకు 280 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ స్థానాలకు 202, వార్డులకు 822 నామినేషన్‌లు దాఖలయ్యాయి. 202లో 125 తిరష్కరించారు. 26 మంది విత్ డ్రా చేసుకోగా 99 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 822, 703 వాలిడ్ నామినేషన్‌లకు 62 వార్డు సభ్యుల అభ్యర్థులు విత్ డ్రా చేసుకోగా 641 మంది బరిలో ఉన్నారు. లక్ష్మీపూర్‌లో 10 వార్డులకు 10 మంది ఏకగ్రీవం అయ్యారు.

గన్నేరువరం: గన్నేరువరం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ శనివారం పూర్తయ్యింది. మండలంలో 17 గ్రామాల సర్పంచ్ స్థానాలకు గోపాల్‌పూర్, పీచుపల్లి ఏకగ్రీవమవగా 56 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. మండలంలోని 140 వార్డులకు 48 ఏకగ్రీవమవగా 284 స్థానాల అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న సర్పంచ్ స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి. గన్నేరువరం 5, గునుకుల కొండాపూర్ 7, గుండ్లపల్లి ఎక్స్ రోడ్ 2, చీమలకుంటపల్లి 3, జంగపల్లి 4, మైలారంలో 3, ఖాసింపేట 5, మాదాపూర్ 3, చొక్కారావుపల్లి 3, యాస్వాడ 2, చాకలివానిపల్లి 4, గుండ్లపల్లి 4, హన్మాజిపల్లి 5, సాంబయపల్లి 2, గోపాల్‌పూర్ 1, పారువెల్లలో 2, పీచుపల్లి 1.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలో 27 గ్రామ పంచా యతీలకు 111 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం బరిలో ఉన్నారు. 240 వార్డులకు 48 ఏకగ్రీవమయ్యాయి. 192వార్డులకు 493 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

మూడో విడత పరిశీలన

సైదాపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శనివారం మూడో విడత నామినేష్ల ప్రక్రియ చేపట్టారు. సైదాపూర్ మండలంలో 27 పంచాయతీలకు, 238 వార్డులకు ఎన్నికలు జరుగుతుండా సర్పంచ్ స్థానాలకు 214, వార్డు సభ్యుల స్థానాలకు 607 నామినేషన్ లు వచ్చాయి. అందులో డమ్మి నామినేషన్లు తీసివేయగా సర్పంచ్ స్థానాలకు 136, వార్డు సభ్యుల స్థానాలకు 539 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

●సైదాపూర్ మండలంలోని ఆరెపల్లిలో సర్పంచ్ స్థానానికి, 8 వార్డు సభ్యుల స్థానాలకు ఒకే నామినేషన్ వచ్చింది. దీంతో ఆ గ్రామం ఏకగ్రీవం అయ్యే అవకాశముంది. మండలంలో 49 వార్డులకు ఒకే నామినేషన్ వచ్చింది. ఆ వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యే అవకాశముంది. ఇంక అధికారిక ప్రకటన రాలేదు. ఈ నెల తొమ్మిదిన అధికారులు అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

వీణవంక: మండలంలోని 26 గ్రామాల సర్పంచులకు 225 నామినేషన్‌లు,246 వార్డు సభ్యులకు 753 నామినేషన్‌లు వచ్చాయి. శనివారం స్క్రూట్నీలో నర్సింగాపూర్ గ్రామనికి చెందిన ఒక సర్పంచ్ నామినేషన్, కనపర్తికి చెందిన వార్డు సభ్యుడి నామినేషన్ తిరస్కరణకు గురయ్యాయని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని 14 వార్డులకు ఒక నామినేషన్ చొప్పున దాఖలవగా ఏక గ్రీవం కానున్నాయి.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని 20 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 196 వార్డు మెంబర్ స్థానాలకు ఆయా గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా శనివారం అధికారులు స్కూటిని నిర్వహించారు. 20 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 149 నామినేషన్లు రాగా, 196 వార్డు మెంబర్ స్థానాలకు 552 నామినేషన్లు వచ్చాయి. స్కూటిని నిర్వహించగా చెల్పూర్, వెంకట్రావ్‌పల్లె గ్రామాల్లోని రెండు వార్డు మెంబర్ స్థానాలు తిరస్కరించారు. సర్పంచ్ స్థానాలకు 116 మంది, వార్డు మెంబర్ స్థానాలకు 507 మంది బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని 18 గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు 104, వార్డు మెంబర్ స్థానాలు 166కు 464 దరఖాస్తులు వచ్చాయి. అందులో మల్యాల గ్రామానికి చెందిన 9వ వార్డు మెంబర్ నరేందర్ నామినేషన్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. 166 వార్డుల్లో 16 వార్డులకు సింగిల్ నామినేషన్ వేయడంతో దాదాపు 16 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 150 స్థానాలకు ఎలక్షన్ జరగనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు.